GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

T MEDIA

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 224 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శనివారం 08-02-2025 | పేజీలు : 3

## రైల్వే ట్రాక్‌ల ఆధునికీకరణ

### గంటకు 130 కి.మీ వేగం



**టి మీడియా, ఫిబ్రవరి 7, విజయవాడ :**

ట్రాక్ మౌలిక సదుపాయాలను ఆధునికీకరించడంలో విజయవాడ రైల్వే డివిజన్ పనులను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా 1,287.76 కిలోమీటర్ల మేర ట్రాక్‌ను గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా అప్‌గ్రేడ్ చేసే పనులను ముమ్మరం చేసింది. గంటకు 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లు ప్రయాణించేలా డివిజన్ పరిధిలోని 58 శాతం ట్రాక్ ప్రస్తుతం అందుబాటులోకి వచ్చినట్లు రైల్వే అధికారులు తెలిపారు.గంటకు 130 కిలోమీటర్ల వేగం : నిడదవోలు–భీమవరం, కాకినాడ పోర్టు – సామర్లకోట, నరసాపూర్–గుడివాడ–మచిలీపట్నం మార్గంలో 473.4 కిలోమీటర్ల మేర ట్రాక్‌ను అప్‌గ్రేడ్ చేసినట్లు సీనియర్ డివిజినల్ ఇంజినీరు వరుణ్‌బాబు వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 129 కిలోమీటర్ల మేర స్లీపర్ రెన్యువల్, 164 కి.మీ. మేర రైల్ రెన్యువల్ సాధించినట్లు వరుణ్‌బాబు తెలిపారు. పీక్యూఆర్ఎస్, టీఆర్‌టీ మెషీన్లను ఉపయోగించి త్వరితగతిన ఆధునికీకరణ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కీలకంగా పనిచేసిన సిబ్బందిని ఈ సందర్భంగా విజయవాడ డీఆర్ఎం నరేంద్ర పాటిల్ అభినందించారు.

# వికసిత ఏపీకి సహకరించండి

- నీతి అయోగ్ ఉపాధ్యక్షుడుని కోరిన సీఎం
- సుమన్‌బేరితో భేటీ



**టి మీడియా, ఫిబ్రవరి 7, అమరావతి:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వికసిత ఏపీ స్వర్ణాంధ్ర –2047 ప్రణాళికకు చేయూతనివ్వాలని సీం చంద్రబాబు నీతి అయోగ్‌కు విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో నీతి అయోగ్ ఉపాధ్యక్షుడు సుమన్‌భేరి బృందం సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఉన్న అవకాశాలు, ఆకాంక్షలపై సీఎం ప్రజెంటేషన్ ఇచ్చారు. వన్ ఫ్యామిలీ, వన్ ఏఐ ప్రొఫెషనల్, వన్ ఎంట్రప్రెన్యూర్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించామని దీనికి కేంద్రం సాయం అవసరమని సుమన్‌బేరీని సీఎం కోరారు. ఏపీ ప్రతియేటా 15 శాతం వృద్ధిరేటు సాధించి 2047 కల్లా 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇది ఎంతో అనుకూల సమయమని అభివృద్ధి చేసేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని సీఎం అన్నారు. ఇందులో నీతి అయోగ్ భాగస్వామ్యం కచ్చితంగా ఉంటుందని సుమన్‌బేరీ హామీ ఇచ్చారు. అయితే రాష్ట్రం ఇంకా విభజన సమస్యల నుంచి తేరుకోలేదని 2 రాష్ట్రాల మధ్య ఉన్న ఆర్థిక వివాదాల గురించి నీతి అయోగ్‌కు వివరించారు. అలాగే హైదరాబాద్‌ను వదులుకోవాల్సి రావడంతోపాటు ఏపీ పూర్తిగా వ్యవసాయ ఆధారిత రాష్ట్రం కావడం, గత ప్రభుత్వం ఐదేళ్ల పాటు మూలధన వ్యయంపై నిర్లక్ష్యం చూపడం, మౌలిక వసతులను కల్పించకపోవడం వంటి ఇబ్బందులు ఉన్నాయని సీఎం వివరించారు.రాష్ట్రంలో పాలనాపరంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధిలో ముందంజ వేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నామని సీఎం చంద్రబాబు నీతి అయోగ్ బృందానికి తెలిపారు. దేశంలోనే మూడో అతిపెద్ద తీరప్రాంతం కలిగిన రాష్ట్రం కావడంతో పోర్టులు–హైవేలతో అతిపెద్ద కనెక్టివిటీ కలిగి ఉన్నామన్నారు. మూడు పారిశ్రామిక కారిడార్లతో తూర్పు–ఆగ్నేయాసియాకు ఏపీ గేట్‌వేగా ఉందని తెలిపారు. పునరుత్పాదకత విద్యుత్, డేటా టెక్నాలజీలో పెట్టుబడులను ఆకర్షించడం ఏపీకి ప్రధాన సానుకూలాంశాలుగా తెలిపారు. దేశంలోని నాలుగు గ్రోత్ హబ్‌ల్లో ఒకటిగా ఉన్న విశాఖ ఎకనామిక్ రీజియన్‌తోపాటు తిరుపతి–అమరావతిని రీజినల్ గ్రోత్ హబ్‌లుగా మలిచేందుకు నీతి ఆయోగ్ సహకారం అందించాలని సీఎం కోరారు.

# మంత్రివర్గ విస్తరణలేనట్లే

### క్లారిటీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి
### మీడియాతో ఇష్టాగోష్ఠి



**టి మీడియా, ఫిబ్రవరి 7, ఢిల్లీ:**

రాష్ట్రంలో ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ లేనట్లేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకేతాలు ఇచ్చారు. దిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన ఆయన, పలు కీలక అంశాలపై స్పందించారు. మంత్రివర్గంలో ఎవరెవరు ఉండాలో అధిష్ఠానానిదే నిర్ణయమని తెలిపారు. తాను ఎవరి పేరూ సిఫారసు చేయడం లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతల కేసుల విషయంలో చట్ట ప్రకారమే ముందుకు వెళతామని చెప్పారు. అర్జెంట్‌గా అరెస్ట్ చేయించి, జైల్లో వేయాలనే ఆలోచన తనకు లేదన్నారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా పని చేస్తున్నానన్నారు.కులగణన ఆషామాషీగా చేసింది కాదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎంతో జాగ్రత్తగా, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని చేశామని వివరించారు. సర్వే ప్రకారం బీసీలు 5.30 శాతం పెరిగారని చెప్పారు. లెక్కలతో సహా చూశాక బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్ ఈ విషయాన్ని ఒప్పుకున్నారని వెల్లడించారు. అలాగే ముస్లిం రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం దక్కుతుందని భావిస్తున్నానని తెలిపారు. పీసీసీ కార్యవర్గ కూర్పు కొలిక్కి వచ్చిందని, ఇందుకు సంబంధించిన విషయాలు ఒకటి, రెండు రోజుల్లో ప్రకటన ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.తాను రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోరలేదని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

ప్రభుత్వం, పార్టీ తీసుకునే అన్ని కీలక నిర్ణయాలు అధిష్ఠానం దృష్టిలో ఉంటాయని తెలిపారు. అధిష్ఠానానికి తెలియకుండా నిర్ణయాలు ఉంటాయని తెలియని వాళ్లు అనుకుంటే చేసేదేమీ లేదని వివరించారు. పార్టీ, పార్టీ నేతల మనోభావాలకు అనుగుణంగానే నడుచుకుంటానే తప్ప, వ్యక్తిగత నిర్ణయాలు ఎప్పుడూ ఉండవన్నారు. పార్టీ ఇచ్చిన పని పూర్తి చేయడమే తన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.తెలియని వాళ్లు ఎన్ని మాట్లాడుకున్నా నాకేం కాదు : రాహుల్ గాంధీకి, తనకు మధ్య ఉన్న అనుబంధం గురించి తెలియని వాళ్లు ఎన్ని మాట్లాడుకున్నా తనకేం కాదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పని చేసుకుంటూ పోవడమే తనకు తెలుసునని, ప్రతి ఒక్క విమర్శకు స్పందించాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# దేశ భవిష్యత్తు అంధకారం'

### మోదీ స్పీచ్‌పై ఖర్గే ఫైర్



**టి మీడియా, ఫిబ్రవరి 7, ఢిల్లీ:**

రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రసంగంపై కాంగ్రెస్ మండిపడింది. చరిత్రలో నివసించే వ్యక్తి వర్తమానం, భవిష్యత్తును ఎలా నిర్మించగలడని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. రాజ్యసభలో ప్రధాని ప్రసంగం అబద్ధాలు, అర్ధ సత్యాలతో నిండి ఉందని ఆరోపించారు.బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేతుల్లో దేశ భవిష్యత్తు అంధకారమని ఎక్స్‌లో ఖర్గే పోస్ట్ చేశారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానత, మాంద్యం, రూపాయి పతనం, ప్రైవేటు పెట్టుబడులు పడిపోవడం, విఫలమైన 'మేక్ ఇన్ ఇండియా' గురించి ప్రధాని మాట్లాడకుండా కాంగ్రెస్‌పై దూషణలను కొనసాగించారని పేర్కొన్నారు.వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు ఇవ్వడానికిభూస్వామ్యాన్ని రద్దు చేయడానికి రాజ్యాంగానికి మొదటి సవరణను కాంగ్రెస్ చేసిందని ఖర్గే గుర్తు చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్‌ను రాజ్యాంగ సభకు తీసుకురావడానికి కాంగ్రెస్ తమ సభ్యుడు ఎంఆర్ జయకర్‌ను ముంబయి నుంచి రాజీనామా చేయించిందని తెలిపారు.నెహ్రూ ప్రభుత్వంలో అంబేద్కర్ దేశానికి మొదటి న్యాయ మంత్రి అయ్యారని గుర్తు చేశారు. ఇందిరా గాంధీ 'గరీబీ హటావో' కార్యక్రమం పేదరికాన్ని తగ్గించిందని ఖర్గే చెప్పారు. యూపీఏ ప్రభుత్వం 27 కోట్ల మందిని దారిద్ర్యరేఖ నుంచి బయటకు తీసుకువచ్చిందన్నారు. ప్రస్తుతం ద్రవ్యోల్బణం కారణంగా ప్రజలు పొదుపు చేసుకోలేకపోతున్నారని రూపాయి అత్యంత బలహీన స్థాయిలో ఉందని ఖర్గే ఆరోపించారు.

**ఇదీ జరిగింది :**

**'సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్'** అనే భావనను కాంగ్రెస్ నుంచి ఆశించడం తప్పిదమే అవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ ఘాటుగా విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగం స్ఫూర్తిదాయకంగా, ప్రభావవంతంగా ఉందని కొనియాడారు. అది మనందరికీ ముందుకు సాగే మార్గాన్ని చూపించిందని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రధాని మోదీ రాజ్యసభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించారు.

# మీ సమస్యలు పరిష్కరిస్తాం రండి

### ఆర్టీసీ జేఏసీతో చర్చలకు సిద్ధమైన సర్కార్



**టి మీడియా, ఫిబ్రవరి 7, హైదరాబాద్ బ్యూరో :**

టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ ఫిబ్రవరి 9 లేదా ఆ తర్వాత ఎప్పుడైనా సమ్మెకు దిగడానికి సిద్ధమవుతోంది. హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఆపరేషన్స్ ఈడీ మునిశేఖర్‌కు జనవరి 27న సమ్మె నోటీసుతో పాటు 21 డిమాండ్ల పత్రాన్ని కార్మిక సంఘాల నేతలు అందించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించింది. ఈ నెల 10న సాయంత్రం 4 గంటలకు చర్చలకు రావాలని ఆర్టీసీ యాజమాన్యం, ఆర్టీసీ జేఏసీకి కార్మిక శాఖ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. సమస్యల పరిష్కారానికే చర్చలకు ఆహ్వానించినట్లు కార్మికశాఖ స్పష్టం చేసింది.

**ప్రధాన డిమాండ్లు ఇవే**

ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం,రెండు పీఆర్‌సీల అమలు,2021 వేతన సవరణ అమలు చేస్తూ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు.కండక్టర్లు, డ్రైవర్ల ఉద్యోగభద్రతపై మార్గదర్శకత్వం.పీఎఫ్, సీసీఎస్ బకాయిల చెల్లింపు.ఆర్టీసీ ఉద్యోగులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు చేయాలి.ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే ఆర్టీసీకి కొనుగోలు చేసి ఇవ్వాలి.ఈ–బస్సుల పేరుతో అద్దె వాహనాలను తీసుకొస్తున్నారు. వీటిపై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ ప్రైవేటు వ్యక్తులకే చెందుతుంది.ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీయే తీసుకుని నడపడం వల్ల సబ్సిడీ కూడా ఆర్టీసీకి వస్తుంది.ఆర్టీసీ అభివృద్ధికి బడ్జెట్‌లో 3 శాతం నిధులు కేటాయించాలి.సంస్థ అప్పులను టేకోవర్ చేయాలి.మహాలక్ష్మి పథకంలో జీరో టికెట్‌కు బదులు మహిళలకు స్మార్ట్‌కార్డుల పంపిణీ.రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలి.ఆర్టీసీలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి.పదేళ్లుగా ఆర్టీసీలో నియామకాలు లేకపోవడంతో ఉద్యోగులపై పని భారం పెరిగింది.సుమారు 16 వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయగా వారి పనిని సర్వీసులో ఉన్న ఉద్యోగులే చేయాల్సి వస్తోంది.పొరుగుసేవల కింద పనిచేస్తున్న విశ్రాంత అధికారులు, సూపర్‌వైజర్లను తొలగించి పదోన్నతులు ద్వారా ఆయా పోస్టుల భర్తీ చేయాలి.కార్మికులకు 8 గంటల పని దినాలు అమలు కావాలిమహిళా కండక్టర్లకు రాత్రి 8 గంటల్లోపు విధులు ముగిసేలా చూడాలి.పీఎఫ్‌కు సంబంధించి ఉద్యోగుల నుంచి రికవరీ చేసిన సుమారు రూ.12 వేల కోట్లను యాజమాన్యం ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌కు పంపించలేదు. వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలి.

# దేవుడి భూమిని స్వాహా

### రెవెన్యూ సర్వేలో వెలుగులోకి



**టీ మీడియా, ఫిబ్రవరి 7,నిజామాబాద్ :**

రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆలయ భూమిని ఆక్రమించి వెంచర్ వేశారు. ఈ ఉదంతం నిజామాబాద్ నగర శివారులో వెలుగుచూసింది. నగర పాలక సంస్థ పరిధిలోని ఈ ఖరీదైన రెండు ఎకరాల భూమిని ఆక్రమించారు. సదరు వ్యక్తులు వేసిన వెంచరుకు రహదారి నిర్మాణం కోసం 6 గుంటల స్థలాన్ని కలిపేసుకున్నారు. మరో 1.09 ఎకరం విస్తీర్ణాన్ని పార్కుగా పేర్కొంటూ చుట్టూ ఫెన్సింగ్ వేశారు.ఇంకో 10 గుంటల స్థలాన్ని ఓపెన్ ప్లాట్లుగా మార్చారు. మరో 15 గుంటలను చదును చేసుకొని తమదిగా చెప్పుకొంటున్నారు. ఇదీ మాణిక్ బండార్ శివారులో భూ ఆక్రమణ బాగోతం. ఈ వ్యవహారంపై వచ్చిన కంప్లైంట్?పై రెవెన్యూ యంత్రాంగం విచారణ చేపట్టారు. రెవెన్యూ యంత్రాంగం చేసిన సర్వేలో ఈ మేరకు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

**అనుమతి పత్రాలతో హాజరు అవ్వాలి**

గుడి భూముల ఆక్రమణ విషయంలో పాలన అధికారికి ఇటీవల కంప్లైంట్ అందింది. ఆయన విచారణకు ఆదేశించటం క్షేత్రస్థాయిలో జరిపిన సర్వేలో ఆలయాలకు చెందిన రెండు ఎకరాల భూమి తగ్గిపోవటం గమనించారు. తగ్గిన ఆలయాల భూమి వెంచరు అభివృద్ధిలో భాగంగా రహదారి, పార్కుకు కేటాయించిన స్థలంగా స్థానికంగా చూపటాన్ని గుర్తించారు.ఈ క్రమంలోనే సదరు వెంచరు అనుమతుల వివరాలను సమర్పించాలని మున్సిపాలిటీ పట్టణ ప్రణాళిక విభాగానికి ఆర్డీవో 2 వారాల కిందట లేఖ రాశారు. కానీ అనుమతిని ఇచ్చింది తాము కాదని, జిల్లా లేఅవుట్ అనుమతుల కమిటీ ఇచ్చిందని వారు సమాధానం ఇచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అనుమతి పత్రాలతో హాజరు అవ్వాలని

మిగతా 3లో..



# రాంగోపాల్‌వర్మ విచారణ స్టార్ట్

- ముందు వైఎస్సార్సీపీ నేతతో మంతనాలు



**టి మీడియా, ఫిబ్రవరి 7, ఒంగోలు రూరల్ :** సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు, అనుచిత వ్యాఖ్యల కేసులో సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ ఒంగోలు రూరల్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు ఆర్జీవీని ప్రశ్నిస్తున్నారు. గతంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ మార్ఫింగ్ ఫోటోలు పెట్టి అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై ఆయన విచారణకు హాజరయ్యారు.గత ఎన్నికలకు ముందు వైఎస్సార్సీపీ అనుకూలంగా 'వ్యూహం' సినిమాను రాంగోపాల్ వర్మ తీశారు. సినిమా ప్రొమోషన్స్ సమయంలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు, ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నారా లోకేశ్ వ్యక్తిత్వాలను కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. వీటిపై మద్దిపాడు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎం.రామలింగం ఫిర్యాదు చేయడంతో పోలీస్ స్టేషన్?లో కేసు నమోదైంది.

**విచారణకు సహకరించాలన్న హైకోర్టు**

ఈ కేసు విచారణలో భాగంగా పోలీసులు గతంలో నోటీసులు ఇచ్చినా ఆర్జీవీ హాజరు కాలేదు. తాను సినిమా షఉటింగ్?లో బిజీగా ఉన్నాననీ, మరో రోజు వస్తానంటూ వాట్సప్ ద్వారా సమాచారం పంపారు. పోలీసుల అనుమతి లేకుండానే విచారణకు దుమ్మా కొట్టారు. దీంతో వర్మను అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్ధమవగా, కొన్నాళ్లపాటు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అదే సమయంలో తనపై పోలీసులు అన్యాయంగా, అక్రమంగా కేసు నమోదు చేశారంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వర్మకు బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు, పోలీసు విచారణకు హాజరై వారికి సహకరించాలని ఆదేశించింది.

**చెవిరెడ్డితో కాసేపు మంతనాలు**

హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఒంగోలు రూరల్ పోలీసుల ఇటీవల వర్మకు నోటీసులు పంపారు. నేడు ఒంగోలు రూరల్ పీఎస్‌లో ఆర్జీవీ విచారణకు హాజరయ్యారు. విచారణకు హాజరయ్యే ముందు ఆర్జీవీ వైఎస్సార్సీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం వెల్లంపల్లిలోని ఓ హోటల్‌లో చెవిరెడ్డిని కలిసిన ఆర్జీవీ కాసేపు మంతనాలు జరిపారు.

# కిటికీలోంచి బయటకు చూశారని విద్యార్థినులను చితకబాదిన టీచర్

**టీ మీడియా,ఫిబ్రవరి 7 ,జయశంకర్ భూపాలపల్లి:** కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 9వ తరగతి విద్యార్థినులను కర్రతో ఓ టీచర్ చితకబాదారు. ఈ క్రమంలో ముగ్గురు విద్యార్థులకు గాయాలు కాగా, ఒక విద్యార్థినికి తీవ్రంగా గాయాలయ్యాయి. చేతి వేలు విరగడంతో ఆసుపత్రిలో విద్యార్థిని చికిత్స తీసుకుంటుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థినులను కొట్టిన టీచర్‌పై చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు.విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కాలేజీలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినిలను ఇంగ్లీష్ టీచర్ సాధ్యం షాన్ విచక్షణారహితంగా కర్రతో కొట్టారు. దీంతో నలుగురు విద్యార్థినులకు గాయాలు కాగా, అందులో ఒకరికి చేతి వేలు విరిగి తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో ఈ విషయం తెలుసుకున్న విద్యార్థిని కుటుంబసభ్యులు అమ్మాయిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.మిగిలిన ముగ్గురు విద్యార్థినుల చేతులకు స్వల్ప గాయాలు అయ్యాయి.



కిటికీలోంచి చూశామని ఎవరో చెప్పిన మాటలు పట్టుకొని మమ్మల్ని ఇంగ్లీష్ టీచర్ కొట్టిందని విద్యార్థినులు చెబుతున్నారు. 9వ తరగతిలో ఉన్న మొత్తం 38 మంది విద్యార్థినులను ఇంగ్లీష్ టీచర్ కొట్టిందని వెల్లడించారు. ఈ సంఘటన బుధవారం రాత్రి జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయం జిల్లా విద్యాశాఖ అధికారికి తెలియడంతో హాస్టల్‌కు వచ్చి తనిఖీ చేసి విచారణ చేపట్టారు.

**టీచర్‌పై చర్యలు తీసుకుంటాం**

విచారణలో భాగంగా టీచర్లు, పాఠశాల సిబ్బంది విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించి మాట్లాడుతున్నారని డీఈఓకు కంటతడి పెట్టుకుంటూ విద్యార్థినులు తెలిపారు. విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టిన ఇంగ్లీష్ టీచర్‌పై చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి వెల్లడించారు. విద్యార్థినుల పట్ల ఎవరైనా సిబ్బంది, ఉపాధ్యాయులు దురుసుగా ప్రవర్తిస్తే తమకు తెలియజేయాలని, వెంటనే వారిపై చర్యలు తీసుకుంటామని డీఈఓ రాజేందర్ తెలిపారు. ఇదే సమయంలో ఈ కస్తూర్బా విద్యాలయం ప్రహరీ గోడ ఎత్తు తక్కువగా ఉండటం వల్ల రోడ్డు మీద వెళ్లేవారు, చుట్టుపక్కల వారితో కొంచెం ఇబ్బంది కూడా ఉందని డీఈవో దృష్టికి తీసుకెళ్లారు.

## కేటీఆర్‌ను కలిసిన శాసనసభ విప్, ఎమ్మెల్సీ



**టీ మీడియా, ఫిబ్రవరి 7, మేడ్చల్:** బి ఆర్ఎస్ పార్టీ శాసనసభ విప్ గా నియమితులైన సందర్భంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ గారు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కే. తారక రామారావు గారిని నర్సింగి జయభేరి టెంపుల్ ట్రీ కాలనీలోని తన నివాసంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తో కలిసి మర్యాదపూర్వకంగా కలిసిసారు కేటీఆర్ శాలువా పూల బొకేతో సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు.

## భూమి పూజ చేసిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



**టీ మీడియా, జనవరి 7 ,ఆత్మకూరు :** ఆత్మకూర్ మండల కేంద్రంలో శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు డా. వాకిటి శ్రీహరి. రెండు నెలల నుండి పెద్దమ్మ గుడి నిర్మాణానికి పట్టణంలోని పెద్దలు యువకులు కృషి అభినందనీయమని ఆయన అన్నారు. పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణానికి నిధులు పట్టణంలోని యువకులు ఇంటింటికి తిరిగి చందాలు పోగుచేశారు. గ్రామంలోని వ్యాపారస్తులు పెద్దమ్మ గుడి నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తున్నందుకు పట్టణంలోని ప్రజలు అభినందనలు తెలిపారు.

## గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న హన్మంత్ రెడ్డి



**టీ మీడియా, ఫిబ్రవరి 7, మేడ్చల్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్ మాజీ కౌన్సిలర్ సరిగారి శ్రీనివాస రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి పూజలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి . ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## బీసీ పొలిటికల్ జేఏసీ కొత్త కమిటీ



**టీ మీడియా ఫిబ్రవరి 7 ఆత్మకూరు :** వనపర్తి జిల్లా మక్తల్ నియోజకవర్గం ఆత్మకూరు మున్సిపల్ కేంద్రంలో స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగేందర్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకులు ఆధ్వర్యంలో బీసీ పొలిటికల్ జేఏసీ మండల కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీలో భాగంగా ఆరెపల్లి సురేందర్ ఆత్మకూరు మండల బిసి పొలిటికల్ జేఏసీ అధ్యక్షునిగా, మండల ప్రధాన కార్యదర్శి అక్కల మల్లేష్ గౌడ్ ను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాలు యుగేందర్ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు ఇస్తున్నటువంటి 42 శాతం రిజర్వేషన్లు సంపూర్ణంగా రాష్ట్ర ప్రభుత్వాల అమలు చేయాలని అదే విధంగా స్థానిక సంస్థ ఎన్నికలలో బీసీలకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని బీసీలు సత్తా చాటాలని పిలుపునివ్వడం జరిగింది.

## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

- సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్



**టీ మీడియా, ఫిబ్రవరి 7, వనపర్తి బ్యూరో :** ఉపాధ్యాయ వృత్తి అన్నిటికన్నా పవిత్రమైనదని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. గత వారం పదవీ విరమణ చేసిన గోపాల్ పేట గెజిటెడ్ హెడ్మాస్టర్ టి.రమాకాంత్ ను సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. వనపర్తి రేడియంట్ హై స్కూల్ లో జరిగిన కార్యక్రమంలో రమాకాంత్ దంపతులను వేదిక సభ్యులు శాలువా పూల మాలతో సత్కరించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ ఒక నాటికి ఇప్పటికీ విద్యా బోధనలో చాలా మార్పులు వచ్చాయని పోటీ ప్రపంచానికి తగిన రీతిలో విద్యార్థులను తీర్చిదిద్దాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.దాదాపు 35సంవత్సరాల తన ఉద్యోగ జీవితంలో అటు విద్యార్థులకు ఇటు ఉపాధ్యాయులకు మార్గదర్శనం చేయడంలో రమాకాంత్ మంచి ప్రగతిని సాధించారని కొనియాడారు.కళాకారుడిగా అతని ప్రతిభ ప్రశంసనీయమని తెలిపారు. ఈనాటి కార్యక్రమంలో కళా వేదిక ప్రతినిధులు జనజ్వాల,కందూరు నారాయణ రెడ్డి, డిసిఇబి జిల్లా సెక్రటరీ సూర చంద్ర శేఖర్, దేశ్ రాములు యాదవ్, సత్తార్, వ్యాఖ్యాత బైరోజు చంద్ర శేఖర్,బండారి శ్రీనివాసులు,నందిమల్ల రాములు, గంధం నాగరాజు, హెచ్.బాలస్వామి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌కు స్ట్రాంగ్ కౌంటర్

**-ఇచ్చిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి**



**టి మీడియా, ఫిబ్రవరి 7, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాజకీయాలు అనూహ్యంగా మలుపు తిరుగుతున్నాయి. గతంలో అధికారంలో ఉన్న వైసీపీ నేతలు ఒక్కొక్కరుగా చేజారుతున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల రాజ్యసభ ఎంపీ పదవితోపాటు రాజకీయాల నుంచి తప్పుకున్న వైసీపీ సీనియర్ నేత విజయసాయిరెడ్డి మరోసారి హాట్ టాపిక్‌గా మారారు. వైసీపీకి ఆయన గుడ్ బై చెప్పేయడంపై ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై విజయసాయిరెడ్డి ఘాటుగా స్పందించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా గట్టి కౌంటర్ ఇచ్చారు. ముఖ్యంగా తన క్యారెక్టర్‌పై వైఎస్ జగన్ చేసిన కామెంట్స్‌కు సాయిరెడ్డి ఇచ్చిన రిప్లై సంచలనంగా మారింది.వ్యక్తిగత జీవితంలో కూడా విలువలు, విశ్వసనీయత, క్యారెక్టర్ ఉన్న వాడిని కాబట్టే, ఎవరికి ఎలాంటి ప్రలోభాలకి లొంగలేదన్నారు విజయసాయిరెడ్డి. భయం అనేది తనలో ఏ అణువు అణువు లోను లేదన్నారు. కాబట్టే రాజ్యసభ పదవిని, పార్టీ పదవుల్ని మరి రాజకీయాలనే వదులుకున్నానని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు.వైసీపీ అధినేత వైఎస్ జగన్ గురువారం(ఫిబ్రవరి 6) మీడియాతో మాట్లాడుతూ.. పార్టీకి వరుసగా గుడ్ బై చెబుతున్న నేతల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. సాయిరెడ్డి కావచ్చు.. వెళ్లిపోయిన ఇతర నేతలు కావచ్చు, వెళ్లబోయే వాళ్లు కావచ్చు, ఎవరికైనా వ్యక్తిత్వం ముఖ్యమని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బెదిరింపులు, ప్రలోభాలు కామన్‌గా ఉంటాయని వాటికి నిలబడిన వాళ్లనే ప్రజలు గుర్తు పెట్టుకుంటారని వైఎస్ జగన్ అన్నారు. ప్రత్యర్థి పార్టీల బెదిరింపులకు భయపడి వెళ్లిపోయిన వాళ్లను జనం పట్టించుకోరని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓపిక అవసరమన్నారు. పార్టీలు మారే వారికి గౌరవం ఉండదని జగన్ అన్నారు. క్యారెక్టర్, క్రెడిబిలిటీ ఉండాలని ఆయన పేర్కొన్నారు.ఈ నేపథ్యంలోనే తాజాగా విజయసాయిరెడ్డి ఘాటుగా స్పందించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఓ పోస్టు షేర్ చేసిన సాయిరెడ్డి.. ఎక్కడా జగన్ పేరెత్తకుండానే చెప్పాల్సింది సూటిగా చెప్పేశారు. వ్యక్తిగత జీవితంలో కూడా విలువలు, విశ్వసనీయత, క్యారెక్టర్ ఉన్న వాడిని కాబట్టే, ఎవరికి ఎలాంటి ప్రలోభాలకి లొంగలేదన్నారు. ఇదిలావుంటే, విజయసాయిరెడ్డి కంటే ముందే వైసీపీకి, రాజ్యసభ పదవికి రాజీనామా చేసిన మోపిదేవి వెంకటరమణ కూడా ఇలాగే రియాక్ట్ అయ్యారు. జగన్ ప్రెస్‌మీట్‌లో తమపై జగన్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. తాను ప్రలోభాలు, ఒత్తిళ్లకు లొంగే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. అలా లొంగే వ్యక్తినే అయితే తనపై కేసులు ఉండేవి కాదని గుర్తు చేసుకున్నారు. ఈ విషయాలన్నీ జగన్‌కి కూడా తెలుసన్నారు. తాము ఎందుకు పార్టీని వీడాల్సి వచ్చింది.. అప్పుడే వివరంగా చెప్పామని మోపిదేవి స్పష్టం చేశారు

## సీపీఐ(ఎం) సానుభూతిపరురాలు వడ్డూరి సీతమ్మ మృతి

- నివాళ్లు అర్పించిన నాయకులు



**టీ మీడియా,ఫిబ్రవరి07,సింగరేణి(కారేపల్లి):** సీపీఐ(ఎం) మాణిక్యారం శాఖ సభ్యుడు వడ్డూరి వీరబాబు మాతృమూర్తి తిరుమలాయపాలెంకు చెందిన వడ్డూరి సీతమ్మ శుక్రవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, కొమ్ము శ్రీనివాసరావు లు సందర్శించి నివాళ్లు అర్పించారు. సీతమ్మ కుమారులైన పుల్లయ్య, వీరబాబు, శ్రీను లకు సానుభూతిని తెలిపారు. నివాళ్లు అర్పించిన వారిలో సీపీఐ(ఎం) నాయకులు పోతర్ల నాగేశ్వరరావు, మేకల వీరన్న, వల్లపు మల్లయ్య, రేపాకుల వీరభద్రం, పోలేపల్లి రవి, అనుసూరి శ్రీనివాసరావు, దేగటి గోపాలు, బుసరాజు పాపులు, గుడిపాటి పాపారావు. ఈశ్వరమ్మ, అరుణ, ఉపేందర్, కొండబోయిన జ్యోతిబాస్, కుర్ర వీరన్న, దేగటి రాజు, వీరునాయక్ తదితరులు ఉన్నారు.

## జర్నలిస్టులకు ఇల్లు మంజూరు చేయాలి

- బీసీ పొలిటికల్ జెసి చైర్మన్ రాచాల యుగంధర్



**టీ మీడియా,ఫిబ్రవరి 7 ,ఆత్మకూరు** ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేసే జర్నలిస్టులకు ఇల్లు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, గత టీఆర్ఎస్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, మీడియా సంస్థలు జీతభత్యాలు ఇవ్వకుండా జర్నలిస్టుల తో వె ట్టి చాకిరి చేయించు కొంటున్నారు. దీంతో జర్నలిస్టుల రోడ్డు పాలై, వారి బ్రతుకులు భారంగా మారాయని ఈ ప్రభుత్వమైన వారిని పట్టించుకోని డబుల్ బెడ్ రూమ్స్ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## మానవత్వం చాటుకున్న ఆటో డ్రైవర్



**టీ మీడియా, ఫిబ్రవరి 07, రామగుండం క్రైమ్:** ఓ ఆటోడ్రైవర్ నిజాయితీని చాటుకున్నాడు. ఈ ఘటన గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. బస్టాండ్ నుంచి మార్కండేయ కాలనీకి వెళ్లిన ఓ ప్రయాణికుడు ఆటోలో సెల్ఫోన్ మర్చిపోయాడు.ఈ విషయాన్ని ఆటో డ్రైవర్ ప్రశాంత్ గుర్తించాడు వెంటనే వన్ టౌన్ పోలీస్టేషన్ను వెళ్లి ఫోన్ను అప్పగించాడు. పోలీసులు సెల్ఫోన్ యజమానిని పిలిచి, ఫోన్ తిరిగి ఇచ్చారు. దీంతో ఆటో డ్రైవర్ ప్రశాంత్ ను అందరు అభినందిస్తున్నారు.

## కర్ణ వేదన కార్యక్రమానికి పాత్రికేయులు



**టీ మీడియా పిబ్రవరి 7,ఎండపల్లి** ప్రెస్ క్లబ్ డీజేఫ్ యూనియన్ ప్రధానకార్యదర్శి, బండి శ్రీధర్ కూతురు సాన్విశ్రీ కర్ణ వేదం కార్యక్రమం మండలం లోని శానబండ గ్రామంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాత్రికేయులు పాల్గొని చిన్నారి సాన్విశ్రీ ని ఆశీర్వధించి కానుకను అందజేశారు .ఈ కార్యక్రమంలొ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గౌరి ప్రభాకర్తుమ్మ శ్రీనివాస్,సభ్యులు వైద్య సతీష్,పరకాల మనోజ్,కుమ్మరి సురేష్ కంటే,ప్రశాంత్,సాగర్,అలిశెట్టి అశోక్,రావికంటి గట్టయ్య, రమేష్ పాల్గొన్నారు.

## విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



**టీ మీడియా, ఫిబ్రవరి 7, వనపర్తి బ్యూరో :** విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని కడుకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాచాల రస్మిక రెడ్డి అన్నారు.శుక్రవారం ఉదయం వనపర్తి జిల్లా కేంద్రంలోని నాగవరం ప్రభుత్వ బిసి బాలుర కళాశాల వసతి గృహం , ఎ %డ% బి వసతి గృహాలలో విద్యార్థులకు మెడికల్ క్యాంపు నిర్వహించి మందులు పంపిణీ చేశారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆమె వాతావరణం మార్పుల వలన కొన్ని సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని భోజనానికి ముందు భోజనం తర్వాత చేతులు సబ్బుతో కడుక్కోవాలని చెప్పారు. వసతి గృహ ఆవరణ పరిసర ప్రాంతాలలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. విద్యార్థులకు జ్వరం సంబంధిత లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తే మెరుగైన చికిత్స అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారులు ఎస్. ఆంజనేయులు, నరేందర్ రెడ్డి, వసతి గృహ సిబ్బంది వైద్య సిబ్బంది విద్యార్థులు తదితరులు

# దేవుడి భూమిని స్వాహా

యజమానులకు నోటీసు ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. దీనిపై అధికారుల తదుపరి చర్యలు ఎలా ఉండబోతున్నాయో చూడాలి మరి.

**ఆలయ భూమిని కొంత కలుపుకొన్నారు**

మాణిక్ బండార్ శివారులోని చిన్న ఆలయాలకు పూర్వం ఇనాం కింద కేటాయించిన భూములు ఉన్నాయి. రెవెన్యూ రికార్డులైన సేతువార్, పహనీల ఆధారంగా 474, 480, 499, 503, 548 సర్వే నెంబర్లలో ఆలయాలకు ఇనాంగా ఇచ్చిన 3.37 ఎకరాల భూమి ఉంది. మరో 13 గుంటల ఖారీజ్ ఖాతాగా ఉన్నయని అధికారులు అంటున్నారు. కాగా నాలుగు సంవత్సరాల కిందట ఈ భూమికి సమీపంలోని భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు.భారీ విస్తీర్ణంతో వెంచరును అభివృద్ధి చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే వెంచరుకు రహదారి నిర్మాణం చేపట్టే టైంలో పక్కనే ఉన్న ఆలయ భూమిని కొంత కలుపుకొన్నారు. అంతటితో ఆగలేదు. ఇంకొంత భాగాన్ని ప్లాట్లు, పార్కుగా కూడా మార్చడం చేశారు.

## ఐదునెలల్లో 39 లక్షల మంది ఓటర్లను ఎలా చేర్చారు ?

**-లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ**



**టి మీడియా, ఫిబ్రవరి 7, ముంబయి :** మహారాష్ట్రలో ఐదు నెలల్లో 39 లక్షల మందిని ఓటర్ల జాబితాలో ఎలా చేర్చారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఎన్నికల సంఘం (ఈసి)ని నిలదీశారు. మహారాష్ట్రలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య కొత్త ఓటర్లు నమోదుపై ఆందోళన వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ, శివసేన (యుబిటి) ఎంపి సంజయ్ రౌత్, ఎన్‌సిపి-ఎస్‌సిపి ఎంపి సుప్రియాసూలే సహా ఇండియా బ్లాక్ నేతలు శుక్రవారం సంయుక్తంగా మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. మహారాష్ట్రలో 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత కేవలం ఐదు నెలల్లో 39 లక్షల మంది ఓటర్లుచేరారని అన్నారు.మహారాష్ట్ర ఎన్నికలలో జరిగిన అవతవకలపై ఈసి సమాధానమివ్వాలని, లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈసి ఓటర్ల జాబితాలను సమర్పించకపోవడంతో ఎన్నికల్లో అవతవకలు జరిగాయని స్పష్టమౌతోందని అన్నారు. రాజ్యాంగాన్ని పూర్తిగా నాశనం చేసే ప్రయత్నం జరుగుతోందని, కానీ తాము రాజ్యాంగాన్ని రక్షించేందుకు యత్నిస్తున్నామని అన్నారు. ఎన్నికల్లో అవకతవకలపై కోర్టును ఆశ్రయిస్తామని అన్నారు.ఈసి నిస్పక్షపాతంగా వ్యవహరిస్తున్నట్లయితే, రాహుల్‌గాంధీ ప్రశ్నలకు సమాధానమివ్వాలని శివసేన (యుబిటి) నేత సంజరు రౌత్ పేర్కొన్నారు. లేకుంటే ప్రభుత్వానికి ఈసి బానిసగా భావించాల్సి వుంటుందని అన్నారు.



## డిటిసీ ఇంట్లో ఐటీ సోదాలు

**టి మీడియా, ఫిబ్రవరి 7,హన్మకొండ :** హనుమకొండ డీటీసీ పుప్పల శ్రీనివాస్ ఇంట్లో ఈరోజు ఏసీబీ అధికారుల సోదాలు నిర్వహిస్తున్నారు. ఆదాయాన్ని మించి ఆస్తులు ఉన్నాయని ఆరోపణ నేపథ్యంలో సోదాలు నిర్వహిస్తున్నారు. అయితే లెక్కకు మించిన ఆస్తులున్నట్లు ఏసీబీ సోదాల్లో వెల్లడయినట్లు తెలిసింది. యాభై కోట్ల రూపాయల మేరకు పైగా ఆస్తులను శ్రీనివాస్ కూడబెట్టినట్లు ఏసీబీ విచారణలో వెల్లడయింది.

**బంధువుల ఇళ్లలో...**

హైదరాబాద్, కరీంనగర్, జగిత్యాల శ్రీనివాస్ బంధువుల ఇళ్లల్లో కూడా ఏసీబీ అధికారుల సోదాలు నిర్వహిస్తున్నారు. పక్క సమాచారంతో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులకు విస్తుపోయే విషయాలు తెలిసాయి. సోదాల సందర్భంగా నగదుతో పాటు బంగారం, వెండి ఆభరణాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.